క్లుప్తంగా

చర్య తీసుకోవాలి

మహబూబాబాద్ అర్బన్ : మానుకోటలో ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు మాదారపు నాగరాజు, రాష్ట్ర నాయకులు బోనగిరి మధు డిమాండ్ చేశారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో శుక్రవారం సూపరింటెండెంట్‌కు పీడీఎస్‌యూ నాయకులు వినతి పత్రం అందజేశారు. మునగాల మహేష్, విజయ్, సుస్మంత్ పాల్గొన్నారు.

జీవితంపై విరక్తి చెంది.. ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య


వీరస్వామి (ఫైల్)

గూడూరు : అనారోగ్యంతో జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి శుక్రవారం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని మట్టి వాడకు చెందిన పూనెం వీర స్వామి (45) కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. ఎంతకూ ఆరోగ్యం కుదుట పడకపోవడంతో జీవితంపై విరక్తి చెంది, ఉదయం ఇంటి ఎదుట ఉన్న చెట్టుకు ఉరేసుకున్నాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే మానుకోట ఏరియా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య సారలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై గిరిధర్‌రెడ్డి తెలిపారు.

రైలునుంచి పడి తమిళనాడు వాసి మృతి


కరసన్ (ఫైల్)

కేసముద్రం : రైలునుంచి పడి తమిళనాడుకు చెందిన ఓ వ్యక్తి శుక్రవారం మృతిచెందాడు. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. కేసముద్రం- తాళ్లపూసపల్లి రైల్వే స్టేషన్ల మధ్య డౌన్ లోడింగ్‌లో వెళ్తున్న రైలునుంచి తమిళనాడుకు చెందిన అన్ను కరసన్ (33) జారిపడి మృతిచెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడి వద్ద లభించిన డైరీ ఆధారంగా గుర్తుపట్టి మృతదేహన్ని ఎంజీఎం మార్చురీకి పంపించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతున్న యువకుడు..


నరేష్ (ఫైల్)

మరిపెడ రూరల్ : మనోవేదనకు గురైన ఓ యువకుడు గడ్డిమందు తాగాడు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మరిపెడ ఎస్సై బొలగాని సతీష్ కథనం ప్రకారం.. ఎల్లంపేట శివారు లక్ష్మాతండాకు చెందిన బానోత్ నరేష్ ఓయూలో పీజీ చదువుతున్నాడు. గతేడాది రోడ్డు ప్రమాదంలో నడుముకు తీవ్ర గాయాలు కాగా ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈ క్రమంలో ఓ పక్క ఆరోగ్యం సహకరించకపోడంతో పాటు చదువు మధ్యలో ఆగింది. దీంతో మనోవేదనకు గురైన నరేష్ గురువారం ఇంటి వద్ద గడ్డి మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సురేష్ మృతి చెందాడు.

నీరులేక..నెర్రెలు

అడుగంటుతున్న భూగర్భ జలాలు

- ఎండుతున్న పచ్చటి పొలాలు
- లో ఓల్టేజీతో కాలిపోతున్న మోటార్లు


నీరులేక ఎండిపోయి నెర్రెలుబారిన వరిపైరు

కొత్తగూడ : ఏజెన్సీలో యాసంగి సాగుపంటలపై ఆశలు ఆవిరవుతున్నాయి. నీరు లేక మోటార్లు కాలిపోవడంతో పచ్చటి పొలాలు నెర్రెలు వారుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. రోజు రోజుకు భూగర్భ జలాలు అడుగంటడంతో వరి పైరుతో పాటు ఇతర పంటలు ఎండిపోతున్నాయి. కొత్తగూడ ఏజెన్సీలో రైతులు బోరుబావులపై ఆధార పడి వ్యవసాయం చేస్తున్నారు. వానాకాలంలో విపరీతమైన వర్షాల వల్ల బోరు బావుల్లో నీరు ఉంటుందని ఆశించిన రైతులు యాసంగిలో వరినాట్లు వేసుకున్నారు. మండలంలో సుమారుగా పది వేల ఎకరాల్లో వరి సాగు చేసినట్లు వ్యవసాయాధికారుల అంచనా. సుమారు 3వేల ఎకరాలు విత్తనోత్పత్తి నాట్లు, 7వేల ఎకరాల్లో సాధారణ వరి వంగడాలు సాగు చేశారు. వరి పొలాలన్ని చిరు పొట్ట దశలో ఉన్నాయి. సరిపడ నీరు అవసరం ఉన్న సమయంలో బోరు బావుల్లో నీరు అడుగంటింది. కొత్తపల్లి, కొత్తగూడ, పొగుళ్లపల్లి, వేలుబెల్లి, కోనాపురం, సాధిరెడ్డిపల్లి, ఓటాయి గ్రామాల్లో బోర్లలో నీరు రాక వరిపైరు ఎండి పోతోంది. 150 ఫీట్ల నుంచి 200 ఫీట్ల లోతు వరకు నీరు పోసే మోటర్లు ఇప్పుడు 350 ఫీట్లకు ఉన్నా నీరురావడం లేదు. ఏం చేయాలో దిక్కుతోచక రైతులు కుమిలిపోతున్నారు.

విద్యుత్ లోఓల్టేజీ సమస్య..

విద్యుత్ లోఓల్టేజి సమస్యతో మోటార్లు కాలిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ బోరుబావులకు 240 ఓల్టేజీ మాత్రమే వస్తుందని దీంతో మోటార్లు వేడితో కాలిపోతున్నట్లు చెబుతున్నారు. కాగా విద్యుత్ కెపాసిటర్లు బిగించుకుని ఆటోమేటిక్ స్టార్టర్లు తొలగిస్తే లోఓల్టేజీ సమస్యను అధిగమించవచ్చని రైతులకు చైతన్యం కల్పిస్తున్నారు.

రైతులకు సమగ్ర సస్యరక్షణ కిట్ల అందజేత


రైతుకు కిట్లు అందజేస్తున్న డీఏఓ విజయనిర్మల

కురవి: మండలంలోని తిరుమలాపురం గ్రామంలో కేంద్రియ సమగ్ర సస్యరక్షణ కేంద్రం హైదరాబాద్ ఆధ్వర్యంలో రైతు క్షేత్ర పాఠశాలలో భాగంగా రైతులకు సమగ్ర సస్యరక్షణ కిట్లను (ఐపీఎం) జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎం.విజయనిర్మల శుక్రవారం అందజేశారు. అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీర్ ఉదయశంకర్ పర్యవేక్షణలో గత ఆరు వారాల నుంచి క్షేత్రస్థాయిలో మిరప పంట వేసినప్పటి నుంచి చేతికొచ్చే వరకు పాటించాల్సిన అన్ని సస్య రక్షణ పద్ధతులను రైతులకు వివరించారు. ఈ సందర్భంగా విజయనిర్మల, సహాయ సస్యరక్షణ అధికారి బసవన్న మాట్లాడుతూ.. పురుగు మందులు వాడే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సాంకేతిక వ్యవసాయ అధికారి రాజు, ఏఓ నరసింహారావు, ఏఈఓ రాజేశ్వరీ, రైతులు పాల్గొన్నారు.

స్వయం పరిపాలన దినోత్సవం

మరిపెడ రూరల్ / నెల్లికుదురు /తొర్రూరు రూరల్/ కురవి : ఆయా మండల కేంద్రాల్లోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయుల పాత్ర పోషించి తోటి విద్యార్థులకు పాఠ్యంశాలను బోధించారు. మరిపెడ మండలంలోని తాళ్లఊకల్ యూపీఎస్‌లో, నెల్లికుదురు మండలంలోని నర్సింహులగూడెం ప్రాథమికోన్నత పాఠశాలలో, తొర్రూరు మండలంలోని అరిపిరాల ప్రాథమిక పాఠశాలలో,కురవి : సీరోలు మండలం కాంపల్లి శివారు బీల్యానాయక్ తండా ప్రాథమిక పాఠశాల, కురవి మండలం కంది కొండ ప్రాథమిక పాఠశాలల్లో స్వయం పరిపాల న దినోత్సవాన్ని నిర్వహించుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో హెచ్ఎంల తో పాటు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై ఇన్‌హౌస్ ఫోరం

డోర్నకల్ : ఉపాధి హామీ పనులపై ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఇన్ హైస్ ఫోరం నిర్వహించారు. 2023, ఏప్రిల్ 1నుంచి 2024, మార్చి 31వ తేదీ వరకు జరిగిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీలు నిర్వహించి ఇన్ హౌస్ ఫోరం చేపట్టారు. డీఆర్డీఓ, ప్రెసిడింగ్ అధికారి మధుసూదన్ రాజు గ్రామాల వారీగా సమీక్షలు చేశారు. వివిధ గ్రామాల్లో ఉపాధి పనుల్లో జరిగిన పొరపాట్లు, అక్రమాలపై పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందికి రూ.1,71,323 రీకవరి, జరిమానా విధించారు. ఈ సందర్భంగా డీఆర్డీఓ మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని, పని చేయని కార్యదర్శులు, ఉపాధి సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉయ్యాలవాడ పంచాయతీ కార్యదర్శిపై డీఆర్డీఓ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీఓ శ్రీనివాస్ నాయక్, అంబుడ్స్‌మెన్ బెస్త ఆదాం, ఏపీఈ మన్మోహన్‌రెడ్డి, ఎంపీఓ మున్వర్‌బేగ్, ఏపీఓ పార్థసారథి, ఎస్టీఎం శ్రీసాయి, ఏపీసీ అంజయ్యగౌడ్, ఎస్ఆర్పీ కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల విజ్ఞాన, విహారయాత్ర



డోర్నకల్ : విజ్ఞాన, విహార యాత్రలో భాగంగా జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు శుక్రవారం ఖమ్మం జిల్లాల్లో పర్యటించారు. పీఎంశ్రీ పథకంలో భాగంగా విద్యార్థులు ఉపాధ్యాయు లు ఖమ్మం ఖిల్లా, లకారం చెరువులోని ట్యాంక్‌బండ్, వెలుగుమట్ల అర్బన్ పార్కును సందర్శించారు.

చిన్న వయసు.. పెద్ద భారం


ఇద్దరు పిల్లలతో పవిత్ర

సాక్షి, మహబూబాబాద్ : మహబూబాబాద్ పట్టణంలోని బాబూనాయక్ తండాకు చెందిన భూక్య బిచ్చా, లక్ష్మీలకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. చిన్న కుమార్తె పవిత్ర ఆర్నేళ్ల ప్రాయంలోనే తల్లి రైలు ప్రమాదంలో మృతి చెందింది. పినతల్లి పెంపకంలో పద్నాలుగేళ్లకే మహబూబాబాద్ భవానీ నాయక్ తండాకు చెందిన లకావత్ అశోక్‌తో వివాహం జరిగింది. వీరికి అశ్విత(6), అక్షర(4) జన్మించారు. ఒకవైపు అనారోగ్య సమస్య, మరోవైపు చిన్న చిన్న కుటుంబ సమస్యలతో పవిత్ర భర్త అశోక్ ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో చిన్నతనంలోనే పవిత్రపై కుటుంబ భారం పడింది. ఇద్దరు కుమార్తెలను పోషించుకునేందుకు జొన్నరొట్టెలు తయారు చేస్తూ అమ్ముతోంది. కుటుంబ భారాన్ని భుజస్కంధాలపై మోస్తోంది.

సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలి

- డీఎస్పీ తిరుపతిరావు



మాట్లాడుతున్న డీఎస్పీ తిరుపతిరావు

మహబూబాబాద్ రూరల్ : బ్యాంకర్లు తమ ఖాతాదారులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని డీఎస్పీ తిరుపతిరావు సూచించారు. మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో బ్యాంకర్లతో సైబర్ మోసాలపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ బ్యాంక్ ఖాతాల పాస్ వర్డులు, ఓటీపీలు ఎవరికి ఇవ్వకుండా ఖాతాదారులు జాగ్రత్త పడేలా చూసే బాధ్యత బ్యాంకర్లపై ఉంటుందన్నారు. మేనేజర్లు, సిబ్బంది తమ ఖాతాదారులను ఎప్పటికప్పు డు అప్రమత్తం చేయాలని కోరారు. ఈ సమావేశంలో టౌన్, రూ రల్, బయ్యారం, డోర్నకల్ సీఐలు దేవేందర్, సర్వయ్య, రవి, రాజేష్, బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.

మిర్చికి గిట్టుబాటు ధర కల్పించాలి


నెహ్రూసెంటర్: రాస్తారోకో చేస్తున్న నాయకులు

నెహ్రూసెంటర్ /నెల్లికుదురు : రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన మిర్చికి క్వింటాకు రూ.25వేలు గిట్టుబాటు ధర కల్పించాలని తెలంగాణ రైతు సంఘం మండల నాయకుడు తూటి వెంకట్‌రెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి బైన స్వామి డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో మండలంలోని శ్రీరామగిరి, వెంకటాపురం, రాజులకొత్తపల్లి గ్రామాల్లో రైతులు పండించిన మిరప పంటను శుక్రవారం పరిశీలించారు. అలాగే జిల్లా కేంద్రంలో సంయుక్త కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. సీపీఐ నాయకులు

డోర్నకల్ : సెయింట్ ఆగ్నేస్ పాఠశాలలో మహిళా దినోత్సవ వేడుకలు



మహబూబాబాద్ అర్బన్: ఉద్యోగినులను సన్మానిస్తున్న డీడీ దేశీరాం నాయక్



మహిళా సాధికారతకు తోడ్పడాలి

మహిళా సాధికారతకు ప్రతీ ఒక్కరు తోడ్పాటు అందించాలని పలువురు కొనియాడారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా శుక్రవారం జిల్లా వ్యాప్తంగా మహిళా అధికారులు, సిబ్బంది, ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఒక మహిళ విజయవంతురాలైతే కుటుంబంతో పాటు సమాజానికి ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. - సాక్షి నెట్‌వర్క్


నెహ్రూసెంటర్: మాట్లాడుతున్న పీఓడబ్ల్యు రాష్ట్ర అధ్యక్షురాలు మంగ


సన్మానిస్తున్న జడ్జిలు సురేష్, తిరుపతి



మరిపెడ: ఎంఈఓను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు


బయ్యారం: మహిళా ఉపాధ్యాయులకు..

టీబీ రహిత గ్రామపంచాయతీగా చర్లపల్లి

బయ్యారం : టీబీరహిత పంచాయతీగా మండలంలోని చర్లపల్లిని ఎంపిక చేసేందుకు ప్రతిపాదనలు పంపుతున్నట్లు మెటర్నల్ చైల్డ్ హెల్త్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సారంగం తెలిపారు. టీబీ ముక్త్ భారత్ పంచాయత్ వెరిఫికేషన్ లో భాగంగా శుక్రవారం బయ్యారం పీహెచ్‌సీని సందర్శించారు. వైద్యాధికారి సాగర్, హెల్త్ ఎడ్యుకేటర్ రాజు, కోఆర్డినేటర్ అశోక్, సూపర్‌వైజర్ జయరాం, నోడల్‌పర్సన్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

క్షయను నివారించవచ్చు

మరిపెడ : సరైన మందులు వాడి క్షయవ్యాధిని నివారించవచ్చని ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం వైద్యాధికారి గుగులోత్ రవి సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో శుక్రవారం క్షయ(టీబీ) పరీక్షలు నిర్వహించారు. వైద్యులు సుదర్శన్, అనిత, రవికుమార్, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోండి

కొత్తగూడ : ఏకలవ్య గురుకుల పాఠశాలలో అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తమ హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని పొగుళ్లపల్లి ఏకలవ్య గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అజయ్‌సింగ్ శుక్రవారం సూచించారు. ఈనెల 16వ తేదీన విద్యార్థులకు ఎంపిక పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు.

అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలి

దంతాలపల్లి : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళ సాధికారతపై విద్యార్థినులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయురాలు మంజుల మాట్లాడుతూ.. విద్యార్థినులు అపరిచితుల మాటలు నమ్మొద్దని చెప్పారు. జీసీఈసీ ఇన్‌చార్జ్ కవిత, మహిళా కానిస్టేబుల్ స్వాతి,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్ల పంపిణీ

గార్ల : మండలంలోని పెద్దకిష్టాపురం ఎంపీపీఎస్, ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఎల్‌హెచ్‌పీఎస్ ఏక్‌మత్రో రాష్ట్ర అధ్యక్షుడు వి.మంగీలాల్ పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు.

చలివేంద్రం ప్రారంభం

మహబూబాబాద్ రూరల్ : జిల్లా కేంద్రంలోని 27వ వార్డు పరిధిలో హనుమాన్ భక్తమండలి ఆధ్వర్యంలో చుక్కల గణేష్ జ్ఞాపకార్థం శుక్రవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ

కొత్తగూడ : ఖమ్మంలో ఈనెల 9న జరిగే రాయల సుభాష్‌చంద్రబోస్ వర్ధంతి సభ వాల్ పోస్టర్‌ను సీపీఐ(ఎంఎల్), న్యూడెమోక్రసీ నాయకులు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకుడు లింగ్యా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం, దేవేందర్, బూర్క వెంకటయ్య, రాజమల్లు, రాయుడు, వెంకన్న, శ్యామల, రమ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

అరిన సరుకులు మార్కెట్‌కు తీసుకురావాలి

కేసముద్రం : రైతులు తమ సరుకును కల్లాల వద్ద ఆరబెట్టుకుని మార్కెట్‌కు అమ్మకానికి తీసుకురావాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి సూచించారు. వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరబెట్టుకుని తీసుకువచ్చిన మక్కలు, ధాన్యంకు మాత్రమే టెండర్లు వేయడం జరుగుతుందన్నారు. దళారులకు సరుకులు విక్రయించి రైతులు మోస పోవద్దన్నారు. ఎస్సై మురళీధర్‌రాజు, ప్రత్యేక గ్రేడ్ కార్యదర్శి అమరలింగేశ్వర రావు, డైరెక్టర్ చిదురాల వసంతరావు పాల్గొన్నారు.

విద్యార్థినుల ప్రతిభ

తొర్రూరు : డ్రాయింగ్ పరీక్షల్లో మైనార్టీ గురుకుల బాలికలు సత్తా చాటారు. కోర్సు సర్టిఫికెట్లను శుక్రవారం డివిజన్ కేంద్రంలోని పాఠశాలలో ప్రిన్సిపాల్ పసునూరి వనజ విద్యార్థినులకు అందజేశారు.

ఇంటర్ పరీక్ష కేంద్రం తనిఖీ

గార్ల : గార్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న పరీక్ష కేంద్రాన్ని తహసీల్దార్ కృష్ణవేణి, ఎస్సై ఎస్‌కే రియాజ్‌పాషా శుక్రవారం తనిఖీ చేశారు. మాస్‌కాపీయింగ్ జరగకుండా ఇన్విజిలేటర్లు బాధ్యతగా చూసుకోవాలని సూచించారు.

'బీజేపీ గెలుపు ఖాయం'

పెద్దవంగర : ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండింటిలో బీజేపీ విజయం సాధిందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయమని బీజేపీ రాష్ట్ర నాయకుడు కక్ర శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రంగు రాములు గౌడ్ అన్నారు. ఎమ్మెల్సీగా కొమురయ్య, అంజిరెడ్డిలు విజయం సాధించడాన్ని హర్షిస్తూ శుక్రవారం మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు బొమ్మెరబోయిన సుధాకర్ ఆధ్వర్యంలో సంబురాలు చేసుకున్నారు. నాయకులు తలారి సో మయ్య, జలగం ఆనంద్, సందీప్, బానోత్ బాలు, కోట కు మార్, బైన కిరణ్, శ్రీకాంత్, పాల్గొన్నారు.

నిమ్మకాయల కలకలం: పోలీసులకు ఫిర్యాదు

నెల్లికుదురు : ఇనుగుర్తి మండలంలోని చిన్న నాగారంలో ఇళ్ల ఎదుట, పక్కన గుర్తుతెలియని వ్యక్తులు నిమ్మకాయలు వేస్తున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..ముత్యాలమ్మతల్లి ఆలయం బజారు నుంచి ఎస్సీ కాలనీకి వెళ్లే బొడ్రాయి రోడ్డు వరకు ఒక్కో ఇంటి ఎదుట నిమ్మకాయలు వేస్తు భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. నిమ్మకాయలపై కనుగుడ్ల బొమ్మలు వేసి రోజుకో ఇంటి ఎదుట పేపర్‌పై రాసి వేస్తున్నారని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఎస్సై రమేష్ బాబును వివరణ కోరగా నిమ్మకాయల కలకలం ఫిర్యాదు అందిందని విచారణ చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

17.50 నల్లబెల్లం పట్టివేత

మహబూబాబాద్ రూరల్ : మండలంలోని కొమ్ముగూడెం తండా శివారులో 17.50 క్వింటాళ్ల నల్ల బెల్లం, 50కిలోల పటికను స్వాధీనం చేసుకున్నామని రూరల్ సీఐ పి.సర్వయ్య, ఎస్సై వి.దీపిక శుక్రవారం తెలిపారు. భూక్య లక్ష్మణ్‌ను విచారించగా బావుసింగ్, సూర్యల వద్ద నుంచి బెల్లం కొనుగోలు చేసి తీసుకువచ్చి నిల్వ చేశామని పేర్కొన్నాడు.

మహిళా టీచర్ ఫొటోలు తీసి వైరల్ చేసిన విద్యార్థి

తొర్రూరు : విద్యాబుద్ధులు నేర్పే మహిళా ఉపాధ్యాయురాలి ఫొటోలు తీసి సామాజిక మాధ్యమాల్లో విద్యార్థి షేర్ చేసిన ఘటన శుక్రవారం స్థానికంగా చర్చానీయాంశంగా మారింది. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఓ మహిళా టీచర్ బోధిస్తున్న తరుణంలో తరగతి గదిలోని విద్యార్థి రహస్యంగా తెచ్చుకున్న స్మార్ట్ ఫోన్‌తో టీచర్ ఫొటోలను తీశాడు. సదరు ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేశాడు. పాఠశాలలోని సహచర ఉపాధ్యాయులు విషయం బాధిత టీచర్‌కు తెలపడంతో ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలకు పోలీసులు చేరుకుని వివరాలు సేకరించినట్లు తెలిసింది. ఈ ఘటనపై హెచ్ఎం లక్ష్మీనారాయణ వివరణ కోరగా.. పాఠశాల విద్యార్థి మహిళ టీచర్ ఫొటోలు తీసిన ఘటన తమ దృష్టికి రాలేదని తెలిపారు.

43 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

చిన్నగూడూరు : రేషన్‌షాప్‌ల్లో అక్రమంగా నిల్వ చేసిన 43 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు డీసీఎస్ఓ ప్రేమ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఉగ్గంపల్లి శివారు మంచ్యాతండా షాపులో నిల్వ ఉన్న 39.50 క్వింటాళ్లు, చిన్నగూడూరులో 3.50 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. డీలర్లు మాలోత్ శంకర్ నాయక్, శ్రీదేవిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. టాస్క్‌ఫోర్స్ ఓఎస్‌డీ ప్రభాకర్, టాస్క్‌ఫోర్స్ సీఐ వసంతకుమార్, తహసిల్దార్ మహబూబ్ అలీ, ఆర్ఐ వెంకన్న ఉన్నారు.

ఎనిమిది మంది అరెస్టు

నెల్లికుదురు : విద్యుత్ తీగల వేసి షాక్‌తో చేపలు పట్టేందుకు వెళ్లి ఒకరి మృతికి కారణమైన 8మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తొర్రూర్ సీఐ గణేష్, ఎస్సై చిర్ర రమేశ్ బాబు శుక్రవారం తెలిపారు. మండలంలోని మేచరాజుపల్లి శివారు ఆకేరు వాగులో గత నెల 19న విద్యుత్ షాక్‌తో చేపలు పట్టేందుకు వెళ్లి జాటోత్ రెడ్యా మృతిచెందాడని తెలిపారు. ధరంసోత్ రెడ్యా, బీకు, గుగులోత్ రాజు, సోమ్లా, మోహన్, బదావత్ తిరుమలేష్, జాటోత్ నర్సింహ, నానులపై కేసు నమోదు చేశామని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

కార్మికులకు రూ.21,000 వేతనం ఇవ్వాలి

- జీపీ వర్కర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పిరెడ్డి


గార్ల: వినతిపత్రం అందజేస్తున్న జీపీ కార్మికులు

మహబూబాబాద్ రూరల్/కురవి/గూడూరు/దంతాలపల్లి/చిన్నగూడూరు/ గార్ల/ నెల్లికుదురు : గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతన చట్టం ప్రకారం నెలకు రూ.21,000 వేతనం చెల్లించాలని గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండ్ల అప్పిరెడ్డి డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికుల సమస్యలపై గార్ల ఎంపీడీఓ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. జనవరి నెల నుంచిఎస్‌టీఓలలో నిలిచి పోయిన పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ వేసవిలో ఎండల తీవ్రత, కార్మికుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకోని ఒక్కపూట పని కల్పించాలన్నారు.అలాగే ఆయా మండల కేంద్రాల్లోను జీపీ కార్మికులు ధర్నా నిర్వహించి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓల కు అందజేశారు. కార్యక్రమంలో పిడమర్తి దాసు, దస్తగిరి, కిరణ్, నరేష్, బంగారయ్య, వీరస్వామి, ప్రేమ్‌చంద్, ప్రభాకర్, రమేష్, ప్రవీణ్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

'ప్రతిజ్ఞ దివస్'ను జయప్రదం చేయండి

గార్ల : తెలంగాణ ఉద్యమ అమరవీరులకు హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ఈనెల 9వ తేదీన నిర్వహించే ప్రతిజ్ఞ దివస్‌ను జిల్లాలోని ఉద్యమకారులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఉద్యమకారుల నియోజకవర్గ కన్వీనర్ కొమ్రాజు జగదీష్ పిలుపునిచ్చారు. నెహ్రూసెంటర్‌లో అమరవీరుల స్థూపం వద్ద ఉద్యమకారులు నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఉద్యకారులకు నెలకు రూ.25,000 పెన్షన్, ఇంటి స్థలం ఇస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఉద్యమకారుల హామీలు అమలు చేయడంలో ప్రభుత్వం వైఫల్యమైందని ఆరోపించారు. కార్యక్రమంలో ఎస్‌కె జాని, నాగాచారి, మల్లిబాబు, వీరస్వామి, కాంతారావు, శ్రీను, సర్వర్‌బేగ్, తదితరులు పాల్గొన్నారు.

'ఎస్సీలను నాలుగు గ్రూపులుగా చేయాలి'

మహబూబాబాద్ : ఎస్సీలను ఏ,బీ,సీ అని కాకుండా నాలుగు గ్రూపులుగా ఏర్పాటు చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ గుగ్గిళ్ల పీరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ భగవాన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీరయ్య మాట్లాడుతూ.. ఎస్సీ ఏ,బీ,సీ,డీ వర్గీకరణపై మంద కృష్ణమాదిగ 30 ఏళ్లుగా పోరాటం చేస్తున్నారని గుర్తు చేశారు. మాదిగ కుల ఎమ్మెల్యేలకు మంత్రివర్గంలో ఇద్దరికి అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. మాదిగలు అన్ని రంగాల్లో వెనకబడి ఉన్నారని వారి అభ్యున్నతికి ప్రభుత్వం పాటుపడాలన్నారు. కార్యక్రమంలో రమేష్, ఎల్లయ్య, రజియా, రేణుక, ప్రవీణ్, సోమయ్య, సాంబయ్య, రవి, సుమిత్ర, మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.